సాక్షి
నల్లగొండ
శనివారం । 18 । జనవరి । 2025



నిరీక్షణకు తెర
డీఎస్సీ–2008 అభ్యర్థులను సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా నియమించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. -IIలో



నేడు నవోదయ పరీక్ష
జవహర్ నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించనున్న పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశారు. - IIలో



గంజాయిని బూడిద చేశాం
పట్టుబడిన గంజాయిని ఎన్‌సీఎల్ పరిశ్రమలో బూడిద చేసినట్లు సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. - IIలో

న్యూస్‌రీల్

21న బీఆర్ఎస్ రైతు మహాధర్నా

నల్లగొండ టూటౌన్ : రైతు సమస్యలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 21న పట్టణంలో రైతు మహాధర్నా నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నాకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని పేర్కొన్నారు. ధర్నాలో రైతులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

20న అప్రెంటిషిప్ మేళా

నల్లగొండ : ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఉత్తీర్ణులైన అన్ని విభాగాల అభ్యర్థులకు ఈ నెల 20న ఉదయం 10 గంటలకు అనుములలోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో ప్రధాని జాతీయ అప్రెంటిషిప్ మేళా, జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మల్లికార్జున్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేసుకుని ఆ కాపీ, బయోడేటా, విద్యార్హత పత్రాలతో మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 8686880100 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ



కనగల్‌లో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ : రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. రేషన్ కార్డుల సర్వేపై జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన మాట్లాడారు. కులగణన సర్వే రిపోర్టు ఆధారంగా రేషన్‌కార్డులు లేని కుటుంబాల జాబితాను ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో తయారు చేసిందని తెలిపారు. జిల్లాల్లో 27,527 రేషన్‌కార్డులు లేని కుటుంబాలు ఉన్నట్లు లెక్క తేలిందని తెలిపారు. 16వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో సర్వే చేపడుతున్నామని.. 21న ప్రారంభం కానున్న గ్రామ, వార్డు సభల్లో అర్హుల జాబితాకు ఆమోదం తీసుకుంటారని తెలిపారు. కలెక్టర్ ఆ జాబితాను పరిశీలించి పౌర సరఫరాల శాఖకు పంపుతారని.. దాని ప్రకారం కొత్తరేషన్ కార్డులు జారీ అవుతాయని తెలిపారు.

ముగిసిన డ్రాయింగ్, టైలరింగ్ పరీక్షలు

నల్లగొండ : నల్లగొండలో నాలుగు కేంద్రాల్లో నిర్వహిస్తున్న డ్రాయింగ్, టైలరింగ్ పరీక్షలు శుక్రవారం ముగిశాయి. శుక్రవారం డ్రాయింగ్ లోయర్, హయ్యర్, టైలరింగ్ లోయర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈఓ భిక్షపతి తెలిపారు. పరీక్షలు శుక్రవారం నిర్వహించిన పరీక్షకు 505 మంది అభ్యర్థులు హాజరుకాగా.. 209 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

రామగిరి(నల్లగొండ): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ ట్యూషన్ ఫీజు చెల్లింపునకు గడువు పొడిగించినట్లు కోఆర్డినేటర్ డాక్టర్ అంతటి శ్రీనివాస్, ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉపేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ సెకండ్, థర్డ్ ఇయర్, పీజీ సెకండియర్ ట్యూషన్ ఫీజు గడువు జనవరి 25వ తేదీ వరకు పొడిగించినట్లు చెప్పారు. డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షల ఫీజు జనవరి 30వ తేదీలోపు చెల్లించాలని పేర్కొన్నారు. డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షలు మార్చి 1 నుంచి 6 వరకు, 3వ సెమిస్టర్ మార్చి 7 నుంచి 13 వరకు, 1వ సెమిస్టర్ పరీక్షలు మార్చి 15 నుంచి 21 వరకు జరుగుతాయని వెల్లడించారు. డిగ్రీ ఓల్డ్ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులకు జనవరి 28 నుంచి ఫిబ్రవరి 8 వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు

సర్వేలో పొరపాట్లకు తావుండొద్దు



సర్వేను పరిశీలిస్తున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

తిప్పర్తి : రైతు భరోసా పథకం అమలుకు చేపడతున్న సర్వేలో పొరపాట్లకు తావుండొద్దని జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. తిప్పర్తి రెవెన్యూ పరిధిలోని కేశరాజుపల్లిలో వ్యవసాయ, రెవెన్యూశాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న రైతు భరోసా సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ యోగ్యం కాని భూముల జాబితాను పక్కాగా రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆనంద్, ఏఈఓ రజిత, ఆర్ఐ ప్రసన్న పాల్గొన్నారు.

పాలనంటే ఇలా..

తనదైన ముద్ర వేస్తున్న జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



దేవరకొండ ఏరియా ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మిక తనిఖీలతో హడలెత్తిసున్నారు. ప్రతి రోజు ఏదో ఒక ప్రభుత్వ కార్యాలయాన్ని తనిఖీ చేయడం, పనుల పురోగతిని పరిశీలించడం, సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. మధ్యాహ్నం తరువాత కలెక్టరేట్‌లో సమావేశాలు, సమీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్‌గా అక్టోబరు 28న విధుల్లో చేరిన ఆమె.. వచ్చిన కొద్ది రోజుల్లోనే జిల్లా పాలనలో తనదైన ముద్ర వేస్తున్నారు.

- ఉదయం ఆకస్మిక తనిఖీలు.. మధ్యాహ్నం రోజువారీ సమావేశాలు
- క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారంపై దృష్టి
- ముఖ్యంగా విద్య, వైద్య సేవలపై ప్రత్యేక కార్యాచరణ
- విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: క్షేత్ర స్థాయిలో పరిస్థితులను తెలుసుకొని పరిష్కరించేందుకు కలెక్టర్ ఇలా త్రిపాఠి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించడంతో పాటు అధికారులు పథకాల అమలులో అలసత్వం వహించకుండా ఎప్పటికప్పుడు పర్యటిస్తూ సూచనలు చేస్తున్నారు. ఆదే క్రమంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. తనిఖీలు, సమావేశాలతో బిజీగా ఉంటున్న ఆమె.. మధ్యాహ్న భోజనం ఇంటినుంచి వెంట తెచ్చుకొని కలెక్టరేట్‌లోనే చేస్తున్నారని, ఈ స్థాయిలో పనిచేస్తున్న కలెక్టర్‌ను తన 30 ఏళ్ల సర్వీసులో చూడలేదని ఓ ఉన్నతాధికారి పేర్కొనడం గమనార్హం. ముఖ్యంగా విద్యా, వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆసుపత్రులు, పాఠశాలలను వారంలో ఒకరోజు తనిఖీ చేస్తున్నారు.

రాష్ట్రంలోనే ముందుగా మిల్లర్లను ఒప్పించింది ఈమే..

జిల్లా కలెక్టర్‌గా ఇలా త్రిపాఠి విధుల్లో చేరిన సమయంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయి. ఆమె ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూశారు. దాదాపు 45 రోజుల పాటు ఆమె నిత్యం ధాన్యం కొనుగోళ్లపైనే దృష్టిసారించి పనిచేశారు. అంతేకాదు మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీ ఇవ్వబోమని మొండికేసి, కొనుగోళ్లు ఆపేయడంతో వారిని ఒప్పించి కొనుగోలు చేయించడంలో నల్లగొండ జిల్లాను ముందువరుసలో నిలబెట్టారు. ఆ తరువాతే రాష్ట్రంలోని మిగితా జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.

మానవతా దృక్పథంతోనే సస్పెండ్ చేయలేదు

అధికారికంగా సెలవు పెట్టకుండా, ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకోకుండా విధులకు గైర్హాజరైన 99 మంది పంచాయతీ కార్యదర్శుల విషయంలో కఠినంగా వ్యవరించలేదు. నిబంధనల ప్రకారం చూస్తే వారిని సస్పెండ్ చేయాలి. మానవతా దృక్పథంతో వ్యవహరించి వారు గైర్హాజరైన కాలానికి మాత్రమే సర్వీసు బ్రేక్ చేశాం. వారి కుటుంబాలు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో వారికి మళ్లీ పోస్టింగ్ ఇచ్చాం. – కలెక్టర్ ఇలా త్రిపాఠి

కులగణనలో ఫస్ట్..

ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా జిల్లా యంత్రాంగాన్ని టీంవర్క్‌తో పనిచేయించడం కలెక్టర్ ప్రత్యేకత. తద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కులగణన సర్వేను ముందుగా పూర్తిచేయించి, నల్లగొండ జిల్లాను స్థానంలో నిలిపారు. అంతేకాదు ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్ కూడా అన్ని జిల్లాల కంటే ముందుగానే పూర్తి చేయించడంలో సఫలీకృతం అయ్యారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే అంతేసంగతులు..

ప్రభుత్వ అధికారులు అంటే ప్రజా సేవకులుగా ఉండాలన్న స్ఫూర్తితో తాను పనిచేస్తూ, అధికారులతో పని చేయిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి.. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఓ జిల్లా అధికారి విషయంలో కూడా ఇలానే వ్యవహరించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని, పద్ధతి మార్చుకోమని చెప్పినా వినకపోవడంతో ఆయనపై బదిలీ వేటు వేశారన్న చర్చ సాగుతోంది. గుర్రంపోడు మండలంలో నిర్లక్ష్యంతో విధులకు గైర్హాజరైన 8 మంది వైద్య సిబ్బందిపైనా చర్యలు చేపట్టారు. అంతేకాదు 99 మంది పంచాయతీ కార్యదర్శుల విషయంలో అలాగే వ్యవహరించారు.



ఎలక్ట్రిక్ రయ్.. రయ్

నల్లగొండకు 72, సూర్యాపేటకు 64ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపు

- నల్లగొండ, సూర్యాపేట బస్ డిపోల్లో సబ్‌స్టేషన్, చార్జింగ్ పాయింట్ల ఏర్పాట్లు సన్నాహాలు
- నాలుగు నెలల్లో జిల్లాలో తిరగనున్న బస్సులు

రామగిరి(నల్లగొండ) : పర్యావరణ సహిత ఇంధనంతో వాహనాలను నడిపించాలనే ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. మొదటగా హైదరాబాద్ నగరంలో ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభమయ్యాయి. ఇటీవల నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలో కూడా ఎలక్ట్రిక్ బస్సు సర్వీస్‌లను ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చింది. ఇప్పుడు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు కూడా 136 బస్సులు రానున్నాయి. వీటిలో నల్లగొండకు 72, సూర్యాపేటకు 64 బస్సులను కేటాయించారు.

జేబీఎం సంస్థ ద్వారా నిర్వహణ

జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా మొదట నల్లగొండ, సూర్యాపేట నుంచి ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఈ బస్సులను జేబీఎం సంస్థ నిర్వహిస్తుంది. ఎలక్ట్రిక్ బస్సులు విద్యుత్ సామర్థ్యం పైనే నడవనున్నందున ఇందుకోసం నల్లగొండ, సూర్యాపేట డిపోల్లో సబ్‌స్టేషన్, చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయనున్నారు. జేబీఎం సంస్థనే విద్యుత్ సంబంధిత పనులు చేపట్టనుంది. పనులు పూర్తికావడానికి నాలుగు నెలల సమయం పట్టనుంది. ఈ బస్సు ఒక్కసారి ఫుల్ చార్జింగ్ అయితే.. 280 నుంచి 300 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది. దాని ఆధారంగా ఈ బస్సులను జిల్లా పరిధిలో ఎలా నడపాలో నిర్ణయించనున్నారు.

సూర్యాపేట హైటెక్ బస్టాండ్‌లో 4 చార్జింగ్ పాయింట్లు

సూర్యాపేట హైటెక్ బస్టాండ్‌లో ఇప్పటికే నాలుగు చార్జింగ్ పాయింట్లు ఉన్నాయి. హైవేపై రాకపోకలు సాగించే ఎలక్ట్రిక్ బస్సులకు అక్కడ చార్జింగ్ చేస్తున్నారు. ఇప్పుడు సూర్యాపేటకు కేటాయించే 64 బస్సుల కోసం ప్రత్యేకంగా సబ్‌స్టేషన్, చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయనున్నారు.

136 బస్సులు రానున్నాయి



నాలుగు నెలల్లో జిల్లాలో ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభమవుతాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 7 డిపోల పరిధిలో అద్దె, ఆర్టీసీకి చెందిన 640 డీజిల్ బస్సులు నడుస్తున్నాయి. వీటికి అదనంగా మరో 136 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. వీటి కోసం ప్రత్యేకంగా 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. వాటి పనులు త్వరలో ప్రారంభమవుతాయి. పనులన్నీ పూర్తయ్యాక బస్సులు అందుబాటులోకి వస్తాయి.

– కె.జానిరెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం, నల్లగొండ

మాదక ద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పక్కన ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ : మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా నల్లగొండను తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్లో నిర్వహించిన జిల్లాస్థాయి నార్కోటిక్ సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా మాదక ద్రవ్యాలను అమ్మేవారిని, వినియోగించే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ నెల 21న జిల్లా విద్యాశాఖ అధికారి, ఆర్సీఓలతో నిర్వహించే సమావేశానికి పూర్తి కార్యాచరణతో హాజరు కావాలని ఆదేశించారు. చిట్యాలలో న్యూ హోప్ అసోసియేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డ్రగ్ డీ అడిక్షన్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారని అలాంటి కేంద్రాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారిని కృష్ణవేణిని ఆదేశించారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ జిల్లాను మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను చేపట్టామన్నారు. సమావేశంలో నార్కోటిక్స్ కేంద్రం హైదరాబాద్ డీఎస్పీ భిక్షపతిరావు, ఆర్డీఓలు వై.అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలు పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా ప్రత్యేకాధికారి అనితా రామచంద్రన్



మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి అనితా రామచంద్రన్

నల్లగొండ : రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం చేపట్టనున్న గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి అనితా రామచంద్రన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పథకాలకు సంబంధించి నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పథకాల విధివిధానాలను గ్రామసభలో చదివి వినిపించి అర్హులను మాత్రమే ఆయా పథకాలకు ఎంపిక చేయాలని సూచించారు. గ్రామసభ విషయాన్ని ముందుగానే ఆయా గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలన్నారు. కొన్ని పథకాలకు అర్హుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రాధాన్యత ప్రకారం మొదటి విడతలో లబ్ధిదారులకు ఆయా పథకాల వర్తింజేస్తామన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ రైతు భరోసా సర్వేకు జిల్లాలో 140 బృందాలను ఏర్పాటు చేశామని.. ఇప్పటివరకు 138 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తయిందని తెలిపారు. రేషన్ కార్డులకు సంబంధించి వచ్చిన అర్హత జాబితాను, దరఖాస్తులను ఆయా మండలాల వారీగా సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నారని ఇప్పటివరకు 70 శాతం పూర్తయిందన్నారు. సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్హులనే ఎంపిక చేయాలి

కనగల్ : కొత్త రేషన్ కార్డుల జారీ కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేయాలని రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేకాధికారి అనితా రామచంద్రన్ అన్నారు. శుక్రవారం ఆమె కనగల్ మండల కేంద్రంలో రేషన్ కార్డుల సర్వేను తనిఖీ చేశారు. సర్వే సందర్భంగా పూర్తి వివరాలను పరిశీలించి నిర్ధారించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు ఇస్తున్న పౌష్టికాహారం, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మ తదితరులు ఉన్నారు.

927 శాఖలు.. 70 వేల కోట్ల టర్నోవర్



మహిళా సమాఖ్య సభ్యులకు చెక్కు అందజేస్తున్న తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్‌పర్సన్ శోభ

- కొత్త పథకాలకు కూడా రుణాలు అందిస్తాం
- తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్‌పర్సన్ శోభ

నల్లగొండ: తెలంగాణ గ్రామీణ బ్యాంకు రాష్ట్రంలో 927 శాఖలు, రూ.70వేల కోట్ల టర్నోవర్‌తో సేవలను అందిస్తుందని తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్‌పర్సన్ వై.శోభ చెప్పారు. శుక్రవారం నల్లగొండలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జనవరి 1 నుంచి ఏపీ గ్రామీణ బ్యాంకు శాఖలు కూడా తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం చేయడం జరిగిందని, ఈ నెల 16 నుంచి ఐఎఫ్‌సీ కోడ్‌లు కూడా టీజీగా మారాయన్నారు. మార్చి నెల నుంచి కొత్త స్కీమ్‌లకు కూడా రుణాలు అందిస్తామన్నారు. గృహ, వ్యవసాయ, మహిళా సంఘాలకు రుణాలతో పాటు ఇతర వ్యాపారులకు కూడా మిగతా బ్యాంకులకు తీసిపోని విధంగా రుణాలు అందిస్తామన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో కూడా సేవలు అందిస్తున్నది తెలంగాణ గ్రామీణ బ్యాంకే అని అన్నారు. భవిష్యత్‌లో మహిళా సంఘాలకు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు ఇవ్వడంతో పాటు వారు రుణాలు తిరిగి చెల్లిస్తే ఒక్కొక్కరికి రూ.3లక్షల చొప్పున వ్యక్తిగత రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ముద్రయోజన రుణాలు ఇవ్వబోతున్నామన్నారు. అనంతరం జిల్లా మహిళా సమాఖ్యకు రూ.50 కోట్ల చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ మేనేజర్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విచారణకు సిద్ధంగా ఉండాలి

- మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: మదర్ డెయిరీ అక్రమాలపై న్యాయ విచారణకు మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి సిద్ధంగా ఉండాలని చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భువనగిరిలో డైరెక్టర్లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన పది సంవత్సరాలుగా డెయిరీని బీఆర్ఎస్ పాలకులే నష్టాల బాట పట్టించి తమపై ఆరోపణలు చేయడాన్ని తప్పు పట్టారు. గడిచిన పాలకవర్గంలోనే రూ.36 కోట్ల అప్పులు, మోయలేని వడ్డీలు, పాడి రైతులకు బిల్లుల చెల్లింపుల జాప్యంతో పాటు పలు అక్రమాలు జరిగాయన్నారు. పారదర్శకంగా జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి చిట్యాల, మిర్యాలగూడలో ఉన్న స్థలాలను విక్రయించి అప్పులు తీర్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. బైలా నిబంధనలు తుంగలో తొక్కిన మాజీ చైర్మన్ 200 మంది ఉద్యోగులను పర్మినెంట్ చేయడం, 150మందికి పదోన్నతులు ఇవ్వడంతో సంస్థపై అదనపు భారం పడుతుందన్నారు. రెండేళ్లు మదర్ డెయిరీ చైర్మన్‌గా ఉన్న శ్రీకర్‌రెడ్డి హయాంలో రూ.12 కోట్ల మేర నష్టం తెచ్చారన్నారు. వచ్చే నెల 7న జనరల్ బాడీ తీర్మానం ఏర్పాటు చేసి రైతులకు సంస్థ నష్టాల వాస్తవ పరిస్థితిని వివరిస్తామని తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు గొల్లపల్లి రాంరెడ్డి, కల్లెపల్లి శ్రీశైలం, పుప్పాల నర్సింహులు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్లు

యోగా.. శక్తివంతమైన ధ్యాన విధానం



నల్లగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న సహజయోగా సభ్యులు

రామగిరి(నల్లగొండ) : అత్యంత శక్తివంతమైన ధ్యాన విధానమే సహజ యోగా అని.. సహజయోగా ట్రస్ట్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరీ కృష్ణ అన్నారు. సహజయోగా ప్రచార రథం నల్లగొండ పట్టణంలో ప్రవేశించిన సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో చైతన్య రథాలతో సహజయోగా ధ్యాన్య విధానాన్ని ప్రజలకు పరిచయం చేస్తున్నామన్నారు. నల్లగొండ పట్టణ పరిసర ప్రాంతాల్లో 15 రోజుల పాటు పర్యటించి ప్రచారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రామ్మోహన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, వినయ్‌కుమార్, మంగారెడ్డి, కృష్ణ, సుధాకర్‌రెడ్డి, సూర్యనారాయణ, ఇందిర, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఊంజల్ సేవ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ తిరు, మాడ వీధుల్లో సేవను ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టించి ఊంజల్ సేవోత్సవం జరిపించారు. ఇక ఆలయంలో నిత్య పూజలు యథావిధిగా కొనసాగాయి.



అమ్మవారికి హారతినిస్తున్న అర్చకులు

అర్హుల గుర్తింపునకు సర్వే

- డీఎస్ఓ వెంకటేశ్వర్లు

శాలిగౌరారం : జిల్లాలో రేషన్‌కార్డుల మంజూరు కోసం 27,573 దరఖాస్తుల్లో అర్హులను గుర్తించేందుకు సర్వే సాగుతోందని జిల్లా పౌరసరఫరాల అధికారి(డీఎస్ఓ) వెంకటేశ్వర్లు అన్నారు. శాలిగౌరారం మండలంలోని అడ్లూరు, వల్లాల గ్రామాల్లో చేపట్టిన సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే సిబ్బందికి పలు సూచనలు చేయడంతో పాటూ సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమేవేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 4.64 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయన్నారు. నూతన రేషన్‌కార్డుల మంజూరు కోసం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల, అర్బన్‌లో రూ.2 లక్షల లోపు ఆదాయం కలిగి ఉండాలని, 3.20 ఎకరాల తరి, 7.20 మెట్ట భూములు మించి ఉండవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మాన్యానాయక్, తహసీల్దార్ యాదగిరి, ఇన్‌చార్జి ఎంపీడీఓ సుధాకర్, ఎంపీఓ పద్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, షేక్ ఇంతియాజ్ తదితరులు ఉన్నారు.



అడ్లూరులో రేషన్‌కార్డుల సర్వేను పరిశీలిస్తున్న డీఎస్ఓ వెంకటేశ్వర్లు

క్లుప్తంగా

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక


సిద్ధు

మోత్కూరు : అడ్డగూడూరు మండలం కోటమర్తి గ్రామానికి చెందిన బి.సిద్ధు జాతీయ స్థాయి సీనియర్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ సెక్రెటరీ ఎం.మానస శుక్రవారం తెలిపారు. ఈ నెలలో నల్లగొండలో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో సిద్ధు ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఒరిస్సా రాష్ట్రం పూరీలో ఈ నెల 17 నుంచి 20 వరకు జరిగే జాతీయస్థాయి సీనియర్ షూటింగ్ బాల్ పోటీల్లో సిద్ధు పాల్గొంటారని తెలిపారు.

డ్రోన్ ద్వారా రక్తనమూనాల తరలింపు


శాంపిల్స్‌ను తీసుకెళ్తున్న డ్రోన్

అడ్డగూడూరు: యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల పరిధిలోని గట్టుసింగారం గ్రామంలో శుక్రవారం మండల వైద్యాధికారి డాక్టర్ భరత్ రాథోడ్ ఆధ్వర్యంలో గ్రామంలో 11 మంది టీబీ లక్షణాలు ఉన్నవారి నుంచి రక్త నమూనాలు సేకరించి వాటిని డ్రోన్ సహాయంతో బీబీనగర్ ఎయిమ్స్ ఆస్పత్రికి పంపించారు. ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించేందుకు డ్రోన్‌లు ఎంతగానో దోహదపడుతున్నాయని వైద్యాధికారి భరత్ చెప్పారు.

లారీ ఢీకొని రైల్వే ఉద్యోగి మృతి


భువనగిరి : లారీ ఢీ కొట్టడంతో రైల్వే ఉద్యోగి మృతిచెందిన సంఘటన శుక్రవారం ఉదయం భువనగిరి మండలంలోని అనాజీపురం గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం వెల్వర్తి గ్రామానికి చెందిన బూడిద యాదగిరి(50) రైల్వే శాఖలో కీమెన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం పగిడిపల్లిలో ఉన్న కార్యాలయానికి విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై గ్రామం నుంచి బయలుదేరాడు. భువనగిరి మండలం అనాజీపురం గ్రామ సమీపంలోకి రాగానే నల్లగొండ నుంచి భువనగిరి వైపు వస్తున్న లారీ బైకును ఢీ కొట్టింది. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని యాదగిరిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అనంతరం హైదరాబాద్‌లోని లాలగూడలో ఉన్న రైల్వే ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే యాదగిరి మృతి చెందాడని చెప్పారు. మృతుడి బంధువు బొల్లేపల్లి మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ సంతోష్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చౌటుప్పల్ రూరల్: ఆగి ఉన్న కారును వెనుక నుంచి బైక్ ఢీకొట్టిన సంఘటన చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురం ఇండస్ట్రీయల్ పార్క్ ఎదురుగా శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్కారం గ్రామానికి చెందిన ఎండీ.అబ్బాస్ బైక్‌పై హయత్‌నగర్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇండస్ట్రీయల్ పార్క్ వద్ద ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఢీకొట్టి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అబ్బాస్‌ను హైదరాబా ద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి అక్క సుల్తాన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణమల్ సూర తెలిపారు.

డీఎస్సీ-2008 అభ్యర్థుల నిరీక్షణకు తెర

- ఇకపై వారు కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా నియామకం
- ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 161 మంది అర్హత



భువనగిరి : డీఎస్సీ-2008లో నష్టపోయిన అభ్యర్థులను ఎట్టకేలకు సెకండరీగ్రేడ్ కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా నియమించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ఆమోదం తెలిపారు. ఈ అభ్యర్థులకు పోస్టింగులు ఇచ్చేందుకు అవసరమైన విధివిధానాలకు సైతం సీఎం ఆమోద ముద్రవేశారు. దీంతో అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వీరి నియామకం ఈ విద్యా సంవత్సరంలోనే జరుగుతుందా లేదా వచ్చే విద్యా సంవత్సరంలో చేస్తారా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. మొత్తం మీద 16 ఏళ్ల నిరీక్షణకు తెరపడినట్లయింది.

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు..

2008 డిసెంబర్ 6వ తేదీన నాటి ప్రభుత్వం 35 వేల పోస్టులతో మెగా డీఎస్సీ-2008 నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో 30 శాతం ఎస్జీటీ పోస్టులను డీఈడీ చేసిన వారికి ప్రత్యేకంగా కేటాయించారు. దీంతో బీఈడీ అభ్యర్థులు మార్కుల పరంగా ముందున్నప్పటికీ నష్టపోయారు. అప్పటి నుంచి తమకు ఉద్యోగాలు ఇవ్వాలని పోరాటాలు చేస్తూ కోర్టులను సైతం ఆశ్రయించారు. వారికి అనుకూలంగా కోర్టులు తీర్పు సైతం ఇచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అభ్యర్థులకు ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు పద్ధతిలో ఎస్జీటీలుగా నియమించాలని విద్యాశాఖ నిర్ణయించింది. వీరికి మినిమం టైమ్ స్కేల్ వేతనం కింద నెలకు రూ.31,030 చెల్లించాలని నిర్ణయించింది.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 161 మంది అభ్యర్థులు

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా 391 మంది డీఎస్సీ-2008కు సంబంధించిన అభ్యర్థులున్నారు. వీరిలో కొందరు ఇతర ఉద్యోగాల్లో చేరారు. సెప్టెంబర్ 27వ తేదీ నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు జరిగిన సర్టిఫికెట్ల పరిశీలనకు 161 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇదే సమయంలో అభ్యర్థులు పూర్తిగా కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగం చేసేందుకు అంగీకరిస్తున్నట్లు సంతకం చేసి అంగీకార పత్రాన్ని సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో అందజేశారు.161 మంది అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిలో పాఠశాలల్లో నియమించడం వల్ల కొంతవరకు ఉపాధ్యాయుల కొరత తీరనుంది.

కొండగడపలో అలుముకున్న విషాదం

- మహారాష్ట్ర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి
- స్వగ్రామం కొండగడపకు చేరిన మృతదేహాలు


నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

మోత్కూరు : మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామస్తులు ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. శ్యాంశెట్టి ప్రేమలత (57), ఆమె పెద్ద కూతురు తునుపునూరి ప్రసన్నలక్ష్మి (42), ఆమె కూతురు అక్షిత (22), మనవడు శ్యాంశెట్టి వైద్విక్ (6 నెలలు) మృతి చెందారు. వారి మృతదేహాలకు ఔరంగాబాద్‌లో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం శుక్రవారం మధ్యాహ్నం స్వగ్రామానికి అంబులెన్సులో తీసుకొచ్చారు. ప్రమాదంలో ప్రేమలత భర్త కృష్ణమూర్తి మెడ నరాలు చిట్లిపోగా.. ప్రసన్నలక్ష్మి చిన్న కూతురు శరణ్య నడుము విరిగింది. ఔరంగాబాద్ ఆస్పత్రిలో వీరు చికిత్స పొందుతున్నారు. దీంతో స్వగ్రామం కొండగడపలో విషాదం అలుముకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారు, వారి కుటుంబ సభ్యులు గ్రామానికి చేరుకున్న తరువాత శనివారం అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు. బాధిత కుటుంబాలను తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మినర్సింహారెడ్డి, పలువురు నాయకులు సందర్శించి పరామర్శించారు.

ఏసీబీకి చిక్కిన డిండి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్


పట్టుబడిన నగదుతో ఆర్ఐ శ్యామ్‌నాయక్

డిండి: డిండి మండల తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ) శ్యామ్‌నాయక్ శుక్రవారం రూ.5 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కాడు. డిండి మండల పరిధిలోని పడమటితండాకు చెందిన ఓ వ్యక్తి 2021 సంవత్సరంలో తన కూతురు వివాహం జరిపించాడు. ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణలక్ష్మీ సొమ్ము పొందడానికి 2023 సంవత్సరంలో ఆన్‌లైన్ చేసి సంబంధిత ఫైల్‌ను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సదరు వ్యక్తి అందజేశాడు. దాదాపు సంవత్సర కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ఆ ఫైల్‌ను ఉన్నతాధికారులకు పంపించడానికి ఆర్ఐ రూ.10 వేలు డిమాండ్ చేయగా రూ. 5వేలు ఇస్తానని బాధితుడు ఒప్పుకున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో నివాసం ఉంటున్న ఆర్ఐ శ్యామ్‌నాయక్‌కు బాధితుడు శుక్రవారం ఉదయం రూ.5 వేల నగదును అందజేశాడు. అప్పటికే మాటువేసిన ఏసీబీ అధికారులు దాడిచేసి ఆర్ఐను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇంటిలో తనిఖీలు నిర్వహించారు. డిండి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐకి సబంధించిన బీరువాలోని రికార్డులను పరిశీలించి స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ ఎం.జగదీష్ చందర్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం


వెంకట్‌రెడ్డి(ఫైల్)

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామ శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. చిట్యాల ఎస్ఐ ఎన్.ధర్మా, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం బొంగోనిచెర్వు గ్రామానికి చెందిన యంపల్ల వెంకట్‌రెడ్డి(54) గుండ్రాంపల్లి గ్రామ పరిధిలోని దొడ్ల డెయిరీ పరిశ్రమకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా శుక్రవారం డెయిరీకి చెందిన ట్రాక్టర్‌కు మరమ్మతులు చేయించేందుకు వెంకట్‌రెడ్డి ట్రాక్టర్‌పై చిట్యాలకు బయలుదేరాడు. వెలిమినేడు గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై ట్రక్ బే వద్దకు చేరుకునే క్రమంలో హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ఖమ్మం డిపో ఆర్టీసీ బస్సు వెంకట్‌రెడ్డి నడుపుతున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఇంజన్ తిరగబడి ట్రాక్టర్ పల్టీ కొట్టింది. ట్రాక్టర్ నడుపుతున్న వెంకట్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని చిట్యాల పోలీసులు పరిశీలించారు. అనంతరం నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ మృతుడు వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులతోపాటు బొంగోని చెర్వు గ్రామస్తులు గుండ్రాంపల్లి గ్రామ పరిధిలోని దొడ్ల డెయిరీ పరిశ్రమ ఆవరణలో వెంకట్‌రెడ్డి మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఉంచి నిరసన తెలిపారు. డెయిరీ ప్రతినిధులు మృతుడి కుటుంబ సభ్యులతో చర్చలు జరిపి పరిహారం ఇచ్చేందుకు అంగీకరించారు. అనంతరం వెంకట్‌రెడ్డి మృతదేహాన్ని నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి కుమారుడు అనిల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై దాడి

మోటకొండూర్: మండలంలోని చాడ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌పై శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఎస్ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు మండలంలోని శారాజీపేట గ్రామానికి చెందిన రాజశేఖర్ మోటకొండూర్ మండలంలోని చాడ గ్రామపంచాయతీలో నాలుగు సంవత్సరాలుగా పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం గ్రామపంచాయతీ పరిధిలోని బెజ్జంకబావి వద్ద సర్వే నిర్వహించి తిరిగి చాడ గ్రామపంచాయతీ కార్యాలయానికి వస్తున్నాడు. ఈ క్రమంలో పిట్టలగూడెం రోడ్డు సమీపంలోకి రాగానే రెండు బైక్‌లపై ఐదుగురు వ్యక్తులు వెనుక నుంచి వచ్చి బైక్‌ను ఆపి పెట్రోల్ కావాలని అడిగి దాడి చేశారు. తీవ్ర గాయాలపాలైన రాజశేఖర్‌ను స్థానికులు గమనించి అంబులెన్స్‌లో భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రి తీసువెళ్లి చికిత్స చేయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయమై అడిషనల్ డీజీ లక్ష్మీనారాయణ, సీఐ కొండల్‌రావు, ఎస్ఐ పాండు విచారణ చేస్తున్నారు.

గాలిపటం ఎగురవేస్తుండగా విద్యుదాఘాతం


బాలుడిని ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

నల్లగొండ: నల్లగొండ పట్టణంలోని 18వ వార్డు శ్రీరామ్‌నగర్ కాలనీలో కందగట్ల కృష్ణ, గీత కుమారుడు నవదీప్(11) శుక్రవారం ఇంటిపై గాలిపటం ఎగురవేస్తుండగా ఇంటి ముందు భాగంలో ఉన్న విద్యుత్ తీగలకు గాలిపటం చుట్టుకుంది. ఇనుప రాడ్‌తో దానిని తీయడానికి ప్రయత్నించే క్రమంలో నవదీప్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన తల్లిదండ్రులు వెంటనే బాలుడిని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాలుడి శరీరం 60 శాతం కాలిపోయినట్లు వైద్యులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని కనుముకుల గ్రామానికి చెందిన చుక్క ఎల్లయ్య(60) అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చుక్క ఎల్లయ్య కుటుంబం ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి మన్సురాబాద్‌లోని సాయిసప్తగిరి కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 12న ఉదయం ఎల్లయ్య వ్యక్తిగత పనిమీద బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఎల్‌బీనగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిస్తే 9984344666, 8688338687 మొబైల్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సీజ్ చేసిన గంజాయి బూడిద చేశాం

సూర్యాపేట ఎస్పీ, డ్రగ్ డిస్పోజబుల్ కమిటీ చైర్మన్ సన్‌ప్రీత్‌సింగ్


గంజాయిని కాల్చివేస్తున్న ఎస్పీ, పోలీసులు

మఠంపల్లి: సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా వివిధ ఘటనల్లో పట్టుబడిన గంజాయిని మఠంపల్లి మండలం మట్టపల్లి వద్ద గల ఎన్‌సీఎల్ పరిశ్రమలో బూడిద చేసినట్లు సూర్యాపేట ఎస్పీ, డ్రగ్ డిస్పోజబుల్ కమిటీ చైర్మన్ సన్‌ప్రీత్‌సింగ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ స్థానికంగా మాట్లాడుతూ గత ఏడాది కాలంగా సూర్యాపేట జిల్లాలోని 15 పోలీస్‌స్టేషన్ల పరిధిలో 44 కేసుల్లో గంజాయిని సీజ్ చేశామని తెలిపారు. ఎస్ఐ ర్యాంకు అధికారి పర్యవేక్షణలో పోలీసు డిపార్టుమెంట్ డీసీఎం వ్యాన్‌లో గంజాయిని పరిశ్రమలోకి తరలించామని, రూ.కోటి 20 లక్షల విలువగల 483 కేజీల గంజాయిని 1000 డిగ్రీల సెల్సియస్‌తో నిర్వీర్యం చేశామని పేర్కొన్నారు. పర్యావరణ రక్షణ, ప్రజారోగ్యానికి హాని కలగకుండా ప్రభుత్వం, కోర్టు ఉత్తర్వుల ప్రకారం జిల్లా డ్రగ్ డిస్పోజబుల్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్‌సీఎల్ ఫ్యాక్టరీ యాజమాన్యం, సిబ్బంది సహకారంతో కిలాన్ అనే అత్యాధునిక సాధనంతో గంజాయిని కాల్చివేశామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, సూర్యాపేట, కోదాడ డీఎస్పీలు రవి, శ్రీధర్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ మట్టయ్య, హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, ఎస్ఐ యాకూబ్, పంచాయతీ సెక్రటరీలు ఎస్‌కె సలీం, మామిడి స్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవలో ఎస్‌బీఐ ముందుంటుంది

- సీజీఎం రాజేష్‌కుమార్


పూజలు చేస్తున్న సీజీఎం రాజేష్‌కుమార్

పెద్దవూర: రైతులకు సేవ చేయడంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం పెద్దవూర మండలంలోని పులిచర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎస్‌బీఐ భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించి, శాంతికి సూచకంగా పావురాలను ఎగురవేశారు. ప్రపంచ వ్యాప్తంగా బ్యాంకింగ్ రంగంలో ఎస్‌బీఐ ఐదో స్థానంలో, భారతదేశంలో మొదటి స్థానంలో ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 1200 బ్రాంచ్‌లు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 50 ఎస్‌బీఐ శాఖలను అధునాతన, సాంకేతిక సౌకర్యాలతో నూతన భవనాలను నిర్మించి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రిమ్స్ పద్ధతిలో మొండి బకాయి రుణాలను 75శాతం మాఫీ చేసి రుణ విముక్తులను చేయనున్నట్లు తెలిపారు. మిగిలిన 25 శాతం రుణాన్ని వినియోగదారులు చెల్లిస్తే తిరిగి రుణాలు అందిస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులకు రూ.20 కోట్ల విలువైన కేఎస్‌ఆర్, ఫౌల్ట్రీ, ఎస్‌హెచ్‌జీలకు మంజూరైన రుణపత్రాలను అందించారు. కార్యక్రమంలో నల్లగొండ డీజీఎం బినోద్‌కుమార్ సిన్హా, రీజనల్ మేనేజర్ మహ్మద్ అల్లావుద్దీన్, పులిచర్ల బ్రాంచ్ మేనేజర్ లకావత్ సక్‌లాల్ (కార్తీక్), రైతులు గజ్జెల లింగారెడ్డి, గడ్డంపల్లి వినయ్‌రెడ్డి, దేవసాని పుల్లారెడ్డి, భిక్షంరెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ గిత్తలకు ప్రథమ స్థానం


గిత్తలతో సుంకి సురేందర్‌రెడ్డి

హుజూర్‌నగర్ : సంక్రాంతి పండుగ సందర్భంగా ఏపీలోని వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం కామునూరులో జరిగిన ఎద్దుల పందేల్లో హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేందర్‌రెడ్డి గిత్తలు ప్రథమస్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా శుక్రవారం సుంకి సురేందర్‌రెడ్డి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కామునూరులో నిర్వహించిన మూడు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేల్లో సీనియర్స్ విభాగంలో 11 జతల ఎద్దులు పాల్గొన్నట్లు తెలిపారు. పోటీల్లో తమ గిత్తలు మొదటి బహుమతి బుల్లెట్ వాహనం గెలుపొందినట్లు పేర్కొన్నారు.

సుధా బ్యాంక్ రజతోత్సవాలు ప్రారంభం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బ్యాంకు చైర్మన్ మీలా మహదేవ్ తదితరులు

సూర్యాపేట : సూర్యాపేటలో సుధా బ్యాంక్ ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం సుధా బ్యాంకులో రజతోత్సవాలను బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేశ్ ప్రారంభించారు. బ్యాంకులోని మినీ ఆడిటోరియంలో జరిగిన వేడుకల్లో చైర్మన్ మీలా మహదేవ్ కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. సూర్యాపేట సర్వీస్ బ్రాంచ్‌లో కొత్తగా నిర్మించిన స్ట్రాంగ్ రూమ్ లాకర్లను ప్రారంభించి మొదటి లాకర్‌ను భాగ్యశ్రీ వెంకన్నకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజతోత్సవం సందర్భంగా 3 రోజులపాటు వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్ పానుగోటి నిర్మల, డైరెక్టర్లు బొనగిరి భాస్కర్, కక్కిరేని చంద్రశేఖర్, శంకర్‌లాల్, ఏపూరి శ్రవణ్ కుమార్, బానావత్ సుజాత, డాక్టర్ మీలా సందీప్, పెద్దిరెడ్డి రాజా, తోట శ్యామ్, గుడిపూడి వెంకటేశ్వరరావు, అప్పం శ్రీనివాసరావు, గాలి శ్రీనివాస్, తోట సత్యనారాయణ, రవీందర్ రెడ్డి, రాచకొండ శ్రీనివాస్, మేనేజర్లు సైదులు, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య

రాజాపేట : మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజాపేట మండలంలోని రఘునాథపురం గ్రామంలో చోటుచేసుకుంది. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొంత వెంకటేష్ (35) కూలి పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. వెంకటేష్‌కు భార్య, ముగ్గు రు కుమార్తెలు ఉన్నారు. కాగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా వెంకటేష్ మద్యానికి బానిసయ్యాడు. కుటుంబంలో నెలకొన్న గొడవల కారణంగా ఇటీవల భార్య పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన వెంకటేష్ గురువారం రాత్రి 10గంటల సమయంలో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం చుట్టుపక్కలవారు గమనించి భార్యకు, పోలీసులకు సమాచారం అందించారు. భార్య రజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మైసయ్య తెలిపారు.

ఉరి వేసుకుని మతిస్థిమితం లేని మహిళ..

నార్కట్‌పల్లి: ఉరి వేసుకుని మతిస్థిమితం లేని మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి నార్కట్‌పల్లి మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి మండలంలోని చెరువుగట్టు గుట్టపైన ఘాట్ రోడ్డులో శివుడి విగ్రహం వద్ద షెడ్డు పక్కన చెట్టుకు గుర్తు తెలియని మతిస్థిమితం లేని మహిళ (40) ఉరి వేసుకుని మృతి చెందింది. గౌరీ సదన్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న రూమ్స్ బుకింగ్ క్లర్క్ నరేష్ గమనించి దేవస్థాన సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డికి ఈ విషయం తెలియజేశాడు. ఇంద్రసేనారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

హైవేపై వాహనాల రద్దీ


చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో రాత్రి సమయంలో జాతీయ రహదారిపై బారులుదీరి వెళ్తున్న వాహనాలు

చౌటుప్పల్ : హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాల రద్దీ కొనసాగుతూనే ఉంది. సంక్రాంతి పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు తిరిగి పట్నం బాట పట్టారు. పండుగ ముగియడం, మరో వైపు సెలవులు కూడా పూర్తవుతుండడంతో ప్రజలు తిరుగు ప్రయాణం అవుతున్నారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో వాహనాలు బారులుదీరాయి. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు రద్దీ కొనసాగింది. హైవేపై వాహనదారులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అదేవిధంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.

కోదాడరూరల్ : సంక్రాంతి పండుగకు హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిన ప్రజలు తిరిగి హైదరాబాద్‌కు వస్తున్నారు. దీంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాల రద్దీ పెరిగింది. వాహనదారులు ట్రాఫిక్‌తో ఇబ్బంది పడకుండా పోలీసులు క్రాసింగ్, జంక్షన్‌ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రమాదాలకు నిలయంగా మారిన కట్టకమ్మగూడెం క్రాస్‌రోడ్‌ను పోలీసులు పూర్తిగా మూసివేశారు. హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ కింద నుంచి వాహనాలు వెళ్లేవిధంగా దారి మళ్లించారు. వాహనాల రద్దీ తగ్గేంత వరకు బందోబస్తు ఇలాగే కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

నేడు జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

పెద్దవూర: మండలంలోని చలకుర్తి క్యాంపులో ఏర్పాటుచేసిన జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ నాగభూషణం తెలిపారు. పరీక్షకు సంబంధించి వివరాలు ఆయన మాటల్లోనే.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు 4547 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 2561 మంది బాలురు, 1986 మంది బాలికలు ఉన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లాలో 693 మంది, సూర్యాపేట జిల్లాలో 1525 మంది, నల్లగొండ జిల్లాలో 2329 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 27 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. నల్లగొండ జిల్లాలో 13, భువనగిరిలో 5, సూర్యాపేట జిల్లాలో 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆరో తరగతిలో 80 సీట్లు ఉన్నాయి. 80 సీట్లలో 75 శాతం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, 25 శాతం పట్టణ ప్రాంతాల విద్యార్థులకు కేటాయించారు. ఇందులో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, 3 శాతం దివ్యాంగులకు, 27 శాతం ఓబీసీలకు, మొత్తం సీట్లలో బాలికలకు 33 శాతం సీట్లు మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేస్తారు. పరీక్ష ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహిస్తారు. 11 గంటలకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. ఆ తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అదనంగా మరో 40 నిమిషాల సమయం అనుమతిస్తారు.

మూడు విభాగాల్లో పరీక్ష

- ప్రవేశ పరీక్ష విరామం లేకుండా రెండు గంటలు కొనసాగుతుంది. వంద మార్కులకు 80 ప్రశ్నలతో ప్రశ్నపత్రం ఉంటుంది. మూడు విభాగాల్లో ఈ ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు 1.25 మార్కు ఉంటుంది. రీజనింగ్ మేధాశక్తిలో 50 మార్కులకు 40 ప్రశ్నలు, గణితంలో 25 మార్కులకు 20 ప్రశ్నలు, తెలుగు లేదా ఇంగ్లీష్ భాషలో ఐదు ప్యాసేజీలు ఉంటాయి. ఒక్కో ప్యాసేజీకు నాలుగు ప్రశ్నల చొప్పున ఉంటాయి. వీటికి 25 మార్కులు ఉంటాయి.

మేధాశక్తికి అధిక మార్కులు

- మేధాశక్తి విభాగంలో 50 మార్కులు ఉంటాయి. బొమ్మలతో కూడిన ప్రశ్నలు ఉంటాయి.

గణితమే కీలకం

- గణిత విభాగంలో 20 ప్రశ్నలుంటాయి. ఒక్కో ప్రశ్నకు 1.25 మార్కుల చొప్పున 20 ప్రశ్నలకు 25 మార్కులుంటాయి. ఐదో తరగతి వరకు అన్ని చాప్టర్లలో ఒకటి లేదా రెండు ప్రశ్నలు అడుగుతారు.

పఠనాశక్తి అంచనా

- భాష పఠనాశక్తిని అంచనా వేసేందుకు భాషా పరీక్ష నిర్వహించనున్నారు. ఈ ప్రశ్నలు 25 మార్కులకు 20 ఉంటాయి. ఈ విభాగంలో ఐదు పాఠ్యాంశాలు ఇస్తారు. ఒక్కో పాఠ్యాంశంలో నాలుగు ప్రశ్నలు వంతున ఉంటాయి.